# మానవుడు దానవుడు



ఒకప్పుడు వసంత రాజ్యంలోని తూర్పు భాగంలో సకాలానికి వానలు కురవక కరువు ఏర్పడింది. కరువు కారణంగా కృష్ణయ్య అనే రైతు తన స్వగ్రామం వదిలిపెట్టి పొట్టపోసుకోవడం కోసం వసంతరాజ్యం రాజధాని అయిన వసంతపురికి వచ్చాడు. అక్కడ పనికోసం చాలా ప్రయత్నాలు చేశాడు కాని, ఏవీ ఫలించలేదు.

ఒకరోజు రాజవీధిలో తిరుగుతున్న కృష్ణయ్యకు దూరంగా గుర్రంమీద పోతున్న నారాయణ కనిపించాడు. అతన్ని చూశాక కృష్ణయ్యలో ఎంతో సంతోషం కలిగింది.

నారాయణ, కృష్ణయ్య చిన్నప్పుడు కలిసి మెలసి తిరిగారు. ఒకసారి ప్రమాదవశాత్తు ఏట్లో పడి కొట్టుకుపోతున్న నారాయణను, తన ప్రాణం కూడా లెక్కచెయ్యకుండా కృష్ణయ్య ఏట్లో దూకి కాపాడాడు. అప్పుడు నారాయణ తన్ను కాపాడిన కృష్ణయ్యతో, "సమయానికి నువ్వు వచ్చి రక్షించక పోతే, నేను యీపాటికి చచ్చివుండేవాణ్ణి. నీ మేలు ఎన్నటికీ మరువలేను," అన్నాడు ఎంతో కృతజ్ఞతతో.

దానికి కృష్ణయ్య ఎంతో అణకువగా, "దాందేముంది. మిత్రుడిగా నా కనీస కర్తవ్యం నేను చేశాను," అన్నాడు.

ఆ తర్వాత కొంతకాలానికి నారాయణ పెళ్లి చేసుకుని, మామగారు వుంటున్న వసంతపురికి వెళ్ళిపోయాడు. మళ్ళా కృష్ణయ్య నారాయణను కలవలేదు.

ఇదంతా క్షణంలో గుర్తుకు వచ్చింది కృష్ణయ్యకు నారాయణని చూస్తే మంచి హోదాలో వున్నట్లు కనిపించాడు. చిన్ననాటి స్నేహాన్ని పురస్కరించుకుని, తనకు ఏదైనా సహాయం చెయ్యమని అడుగుదామనుకున్నాడు కృష్ణయ్య.

నారాయణ గురించి వివరాలు సేకరించాడు అతను రాజాస్థానంలో ఉన్నత పదవిలో వున్నాడని తెలుసుకున్నాడు కృష్ణయ్య.

మర్నాడు సాయంకాలం కృష్ణయ్య నారాయణ యిల్లు వెతుక్కుంటూ వెళ్లాడు. అదొక పెద్ద భవంతి. ఆరుబైట ఆసనాలు వేసుకుని నారాయణ, అతని భార్య పిల్లలు, అత్తమామలు మాట్లాడుకుంటూ ఫలహారాలు తింటున్నారు.

కృష్ణయ్య మాసిన గడ్డంతో, చిరిగిపోయిన బట్టలతో ప్రహరీగోడ ద్వారం దగ్గర నిలుచుని, "నారాయణా!" అంటూ చనువుగా పిలిచాడు.

నారాయణ కృష్ణయ్య వంక చూసి అతన్ని గుర్తుపట్టాడు. కాని బికారిలా వున్న కృష్ణయ్యను తన స్నేహితుడని చెప్పుకోడానికి సిగ్గు పడ్డాడు.

కృష్ణయ్య దగ్గరకు వచ్చి, 'ఎవరయ్యా నువ్వు?' అని అడిగాడు నారాయణ ఏమీ ఎరగనట్టు.

'నేను కృష్ణయ్యను. నీ చిన్ననాటి స్నేహితుణ్ణి. ఏటిలో కొట్టుకుపోతున్న నిన్ను కాపాడిన కృష్ణయ్యను. నన్ను గుర్తుపట్టలేదా నారాయణా?' అని ఆత్రంగా అడిగాడు కృష్ణయ్య.

అతన్ని ఎగాదిగా చూసి, మొహం పక్కకు తిప్పుకుంటూ, "నువ్వెవరో నాకు తెలీదు. నేను ఏ ఏటిలోను కొట్టుకుపోలేదు. ఇక్కణ్ణుంచి వెళ్ళిపో," అన్నాడు నారాయణ.

అతని మాటలు కృష్ణయ్య గుండెల్లో ములుకుల్లా గుచ్చుకున్నాయి. మరోమాట



మాట్లాడకుండా, వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. అలా వెళ్ళి ఊరి చివర వున్న ఒక తోట దగ్గర కూర్చుని దుఃఖ పడసాగాడు కృష్ణయ్య.

ఆ తోట యజమాని రామయ్య. ఎంతో మంచివాడు. కృష్ణయ్య దుఃఖపడుతుండటం గమనించి తోట లోపలినుంచి వచ్చి అతన్ని పలకరించి అతని వివరాలు అడిగాడు.

కృష్ణయ్య ఆయనతో మరింతగా దుఃఖిస్తూ తనని నారాయణ ఎంత అవమానపరిచాడో చెప్పుకొచ్చాడు.

"అయ్యా ఒకప్పుడు యీ నారాయణ ప్రాణం కాపాడాను. ఆ కృతజ్ఞత కూడా లేకుండా నేను గుర్తులేనట్లు నటించాడు," అంటూ బాధపడ్డాడు కృష్ణయ్య.

అతని మాటలకు నవ్వి, "నారాయణ నీకు కృతజ్ఞత చూపించాలనే అతని ప్రాణం కాపాడావా?" అని అడిగాడు రామయ్య.

"లేదనుకోండీ.." అంటూ ఏదో చెప్పబోయాడు కృష్ణయ్య.

"పిచ్చివాడా మరి ఎందుకు బాధపడతావు. ఒక మనిషి ప్రాణం పోతూ వుంటే కాపాడ్డం మరొక మనిషి కనీస కర్తవ్యం. అందుకు ప్రతిఫలం ఆశించడం అవివేకం. ఒకడి ప్రాణం మనం కాపాడగలిగాం అని తృప్తి వుంటే చాలు" అన్నాడు రామయ్య. ఆయన మాటలు విని కృష్ణయ్య ఆలోచనలో పడ్డాడు.

అప్పుడు మళ్ళా రామయ్య, "నాయనా! ఎవరో మనకు సహాయపడితేనే బతగ్గలమనుకోవటం



వుత్త భ్రమ. ప్రయత్నం చెయ్యని వాడికి ఏ దేవతా సహాయపడదు," అన్నాడు అను నయంగా.

"నేను పని కోసం ఎంతో ప్రయత్నం చేశాను," అన్నాడు కృష్ణయ్య.

"పని కోసమే కాదు కృష్ణయ్యా, స్వతంత్రంగా బతకటానికి కూడా ప్రయత్నించాలి. నీకు అభ్యంతరం లేకపోతే స్వతంత్రంగా నువ్వు బతకటానికి ఒక మార్గం చూపుతాను," అన్నాడు చనువు తీసుకుంటూ రామయ్య.

"అంతకంటేనా," అన్నాడు ఉత్సాహంతో కృష్ణయ్య.

"నా తోటలో రకరకాల పళ్లు కాస్తాయి సంవత్సరం పొడుగునా. ఈ పళ్లను కోసుకుని ఊళ్లో అమ్ముకున్నాక నాకు యీయవలసిన డబ్బు యిద్దువుగాని, లాభం నువ్వు వుంచుకో," అంటూ ఎలా చెయ్యాలో వివరించాడు రామయ్య.

"మీకు ఎంతో కృతజ్ఞుణ్ణి రామయ్య గారూ! ముక్కూముఖం ఎరగని నాకు జీవనోపాధి కల్పిస్తున్నారు. చేసిన మేలు మరిచిపోయే నారాయణ లాంటి వాళ్లు యీ లోకం నిండా వున్నారని అపోహ పడ్డాను యింతకు ముందు. మానవత్వంతో యితరులకు సహాయపడే మీలాంటి దేవుళ్లు కూడా వున్నారని యిప్పుడు తెలుసుకున్నాను," అన్నాడు చేతులు జోడిస్తూ కృష్ణయ్య.

"కృష్ణయ్యా, నేను నువ్వన్నట్టు దేవుణ్ణి కాను. మామూలు మనిషినే, కష్టాలు వచ్చినప్పుడు ఆదుకున్నవాడు దేవుడిలా కనిపించటం సహజం. దేవుడూ మనిషిలోనే వున్నాడు, రాక్షసుడూ అతనిలోనే వున్నాడు, మానవుడు-దానవుడు కూడా మనిషే" అన్నాడు విడమరుస్తూ రామయ్య.

ఆనాటి నుంచి కృష్ణయ్య, రామయ్య తోటలో కాసిన పళ్లను కోసుకెళ్లి ఊళ్ళో అమ్ముకొచ్చేవాడు. ఎంతో కష్టపడి పళ్ల వ్యాపారం చేసుకుంటూ అనతికాలంలోనే కృష్ణయ్య పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు.

